# వర్షించని మేఘం



కె. శాంత

**వే**సవి కాలం కావడాన ఆకాశం స్వచ్ఛంగా వుంది. పగలంతా తన ప్రతాపం చూపిన సూర్యుడు అలసి సొలసి విశ్రాంతికని తన మందిరానికి చేరుకుంటున్నాడు. పక్షుల కిలకిల రావాలు జగతికి ఏదో సందేశాన్నిస్తున్నాయి. సముద్రంలో అలల్లా తీరంలో జనసందోహం కూడా ఉత్సాహంగా, ఉల్లాసంగా వుంది. పగలంతా ఉక్కతో చమటతో గడిపిన జనానికి సాయంత్రమయేసరికి ఆట విడుపులా అనిపిస్తుంది. హాయిగా స్నానం చేసి చల్లగాలిలో గడిపి రావాలన్న కోరికతో బయట పడతారు. ముఖ్యంగా సముద్రతీరం కోలాహలంగా పెళ్ళివారిల్లులా వుండేది, ఇప్పుడే!

పిల్లల ఆటపాటలు చూసి మురిసిపోతూ కబుర్లు చెప్పుకుంటున్న భార్యాభర్తలు. రెండు మూడు కుటుంబాల వాళ్ళు కలసి కూర్చుని ఏవో సేవిస్తూ సరదాగా కాలక్షేపం చేసేవారూ, జట్లు జట్లుగా ఆటలాడుతున్న పిల్లలూ, అంతా సందడిగా, కోలాహలంగా వుంది. ఇంచుమించు అన్ని కాలేజీలలోనూ, స్కూళ్ళలోనూ పరీక్షలైపోవడంతో నిన్న మొన్నటి దాకా ఎంత జనమున్నా ఏదో వెల్తిగా వున్న సముద్రతీరం కొత్త కొత్త అందాలలో నూతనోత్సాహంతో వెల్లివిరుస్తోంది.

"పరీక్షలైపోయేయంటే ఏదో దిగులుగా వుందే మనూ! ఇన్నాళ్ళూ హాయిగా చదువుకుంటూ, ఫ్రెండ్స్‌తో తిరుగుతూ చీకూ చింతా లేకుండా గడిపేము. ఇకముందు అన్నీ బంద్, ఇంట్లో ఏం చెయ్యాలో."

మంజుల దిగులు చూసి మనోరమ నవ్వింది. పరీక్ష లయిపోయినందుకు హాయిగా స్వేచ్ఛావిహంగంలా వూపిరి పీల్చుకోక దిగులెందుకూ. పైగా చీకూ చింతా లేకుండా గడిపేమా? మైగాడ్. ఆ లైఫ్ తల్చుకుంటేనే భయమేస్తోంది. ఇంతలేసి పుస్తకాలు, పరీక్షలు, చదువు. ఏమైనా ఇక ఆ టెన్షన్ వదిలినందుకు హాయిగా వుంది బాబూ!"

"నీ కలాగే వుంటుందిలే. ఎప్పుడెప్పుడు పరీక్షలయిపోతాయా. ఈ చదువు పీడ వదిలించుకుని బావగారి ఒడిలో వాలదామా అని ఎదురు చూస్తున్నావు!"

"ఓహో! అదా నీ బాధ. నేను మీ అమ్మగారికి నీ గురించి రికమెండ్ చేస్తాలే. నా కంటే ముందు నువ్వే ఎవరి ఒడిలోనో వాలుదువుగాని." ఆట పట్టించింది మనోరమ.

మంజుల సున్నితంగా విసుక్కుంది. "ఛ! ఛ! నీకెంతసేపూ హాస్యమే. నా ఉద్దేశ్యం అది కాదు. ఇక కాలేజీకి వెళ్ళక్కరలేదు. పైగా నువ్వుకూడా వుండవు నేనేం చెయ్యాలి?"

"అదేం? ఎమ్.ఎ. చదువుతానన్నావుగా."

"అనుకున్నాను. కాని మా అమ్మ ససేమిరా వీల్లేదంటున్నాది. మా నాన్నగారు కూడా అమ్మ పక్షమే. ఇంకెందుకమ్మా చదువు? విజ్ఞానానికి అంతెక్కడ. అది నువ్వు నీ స్వయం కృషితో నైనా సంపాదించవచ్చు. మనిషికి కనీసం డిగ్రీ వుండాలని నా ఉద్దేశ్యం. అది నీకు రాబోతోంది. ఇక మనకి తగ్గట్టు ఒక మంచి వరుణ్ణి చూసి నిన్ను అతని చేతిలో పెడితే మాకు తృప్తి. నీ పెళ్ళైతేనే కదా అన్నయ్య పెళ్ళి అంటూన్నారు" అంది మంజుల దగ్గరలో ఒక చిన్నపాప కడుతున్న పిచ్చుక గూటిని దీక్షగా చూస్తూ.

చాలా దీక్షతో, కష్టపడి అందంగా కట్టిందా పాప. మానవుడి ఆశలకి – ఆశయాలకి ప్రతిబింబంలా వుందా పిచ్చుకగూడు. దానిమీద అతని ఆశలకి ప్రతిరూపాల్లా నత్తగుల్లలు అమర్చింది. చాలాసేపటి నించి ఆ పాప గూడు కడుతున్నట్టువుంది. ఇంకా శ్రద్ధగా ఏవో అలంకరణలు చేస్తోంది.

"ఓహో! అదన్నమాట సంగతి. అయితే

త్వరలోనే నువ్వుకూడా త్వరలోనే ఒక అబ్బాయి గారి ...''

మంజుల మనోరమ వాక్ప్రవాహానికి మధ్యలోనే ఆనకట్ట వేసింది. ''అబ్బబ్బ ! నీ కన్నీ తమాషాలే మనూ ! నాకప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. హాయిగా చదువుకోవాలని వుంది.''

''ఊఁ చదువుకుని'' తల ఒక ప్రక్కకి వాల్చి కొంటెగా చూస్తూ సవాల్ చేసింది మనోరమ.

''చదువుకుని ఉద్యోగం చేస్తా. నా కాళ్ళమీద నేను నిలబడానికి ప్రయత్నిస్తాను''

''ఇప్పుడు మాత్రం నీ కాళ్ళమీద కాక నా కాళ్ళమీద నిలబడ్డావా ?''

''మనూ ! డోంట్ బి సిల్లీ !'' తీక్షణంగా కసిరింది.

''మై గాడ్. నువ్వేదో పైత్యపు మాటలాడుతూ పైపెచ్చు నన్ను కసురుతున్నావు. వుద్యోగం చెయ్యడం నీ కాళ్ళమీద నువ్వు నిలబడడం అన్నీ హీరోయిన్‌లా బాగానే చెప్పావు గాని, బి ప్రాక్టికల్. పెళ్ళి అవసరం, జీవితానికి అదిచ్చే పరిపూర్ణత గురించి తెలీని అమాయకురాలివని నేననుకోను.'' మనోరమ కూడా ఘాటుగానే సమాధానమిచ్చింది.

''అది కాదు మనూ ! నా బాధ అర్థం చేసుకో. నీకేం ఎన్నైనా చెప్తావు. చిన్నప్పటి నుంచి తెలిసిన మనసులు కలిసిన వ్యక్తి నీ కాబోయే వరుడు. స్వయానా మేనత్త నీ అత్త గారు. అందుకే ఎప్పుడెప్పుడు పెళ్ళి అవుతుందా అని ఎదురు చూస్తున్నావు.''

''ఆఁ అదీ ! అలా రా దారికి ! అసలు భయం అదన్నమాట. నువ్వు కూడా ఒక మంచ బ్బాయిని చూసి మనసు కలుపుకుని మరీ పెళ్ళాడు''

''నీకు ప్రతిదీ హాస్యమే'' అన్న మంజుల మాటలకి ''హాస్యం కాదు. సీరియస్‌గానే చెప్తున్నాను. నచ్చుకుని అన్నీవిచారించి కావాలంటే కాస్త టైమ్ తీసుకుని అన్నీ సంతృప్తిగా వున్నప్పుడే పెళ్ళి చేసుకో.''

''సరి సరిలే. ఇదేమైనా సినిమానా ? ఇంతకీ నీ పెళ్ళెప్పుడు'' అంది మంజుల. మనోరమ ధ్యాస మరోవైపు మళ్ళిస్తూ.

సడన్‌గా మనోరమ సీరియస్‌గా మారి పోయింది. ''నా పెళ్ళి వాయిదా పడింది.'' అంది కాస్త ఉదాసీనంగా.

''అదేం. ఈ సంవత్సరం నీ పెళ్ళయి పోతుందని మేమంతా అనుకుంటున్నామే. అంతలోనే ఏమయింది ?''

''ఏం లేదు. మా బావ చదువు ఆర్నెల్లు పొడిగించబడిందిట. అదయేక తనకి జాబ్ దొరకాలిట. ఇవన్నీ అయితే కాని తను పెళ్ళి చేసుకోడుట.'' అంది మనోరమ విస్పృహగా, ఆ అమ్మాయికి చదువొక పెద్దబోరు. స్వంత బావే అయినా అతనిని ఒక ప్రియుడిగా ప్రేమిస్తుంది. అందుకే అంత ఆరాటం.

''ఏమిటో అనుకున్నానే! మరికొన్నాళ్ళు విరహ బాధ భరించాల్సి వస్తుందనుకో. కాని హాయిగా వడ్డించిన విస్తరిలా నీ ముందు జీవితం పెడదామని మీ బావ తలపు. చూడు ఎంత ముందు చూపో. సంతోషించక అలా బాధపడతావేం.'' అంది మంజుల.

ఇంతలో ఎక్కడినుంచో ఒక బంతి వచ్చి ఆ పాప కట్టిన పిచ్చుకగూటిని తన్నుకుని ముందుకు సాగి సముద్రంవైపు పరుగు తీసింది. బంతి దూరంనించి ఎక్కువ బలంగా రావడం వలన పిచ్చుకగూడు ఛిన్నాభిన్నమైంది పాప రెండు క్షణాలు అయోమయంగా చూస్తూ నించుంది. ఆ తరువాత ఇసుకలో చతికిలబడి ఏడుపు లంకించుకుంది. ఎందుకో మంజుల మనసు కలత బారింది. ''ఇక వెళ్దామా'' అంటూ మనోరమ లేవడంతో తనూ లేచి బట్టల కంటిన ఇసుక దులుపుకుని చెప్పులు వేసుకుంది.

* * *

ఎవరో పిలుస్తున్నట్టుగా అనిపించి ఉలిక్కి పడి లేచింది మంజుల. నిజంగానే మంచంకి కొంచెం దూరంలో నించుని తనని పిలుస్తున్నాడు నౌకరు రంగయ్య.

''ఏమిటి రంగయ్యా ! హాయిగా నిద్ర పోతుంటే అలా లేపొద్దని ఎన్నిసార్లు చెప్పేను. ఎప్పటికప్పుడు కొత్తేనా'' అంది విసుక్కుంటూ.

''కాదండమ్మా ! మనోహరమ్మగారు ఫోనులో పిలుస్తుండారు'' అన్నాడు నెమ్మదిగా.

''ఇప్పుడంత అర్జెంటు పన్లేవీ లేవులే. పడుకున్నానని చెప్పకపోయేవా ?'' అంది మరో ప్రక్కకి ఒత్తిగిల్లుతూ.

''చెప్పేనమ్మా ! పనుంది లేపమన్నారు''

ఇక మంజులకి తప్పలేదు. విసుక్కుంటు లేచింది. నిద్రలో లేపితే భలే కోపం వస్తుం ఆమెకి. ఫోను అందుకుని ''హల్లో'' అం విసురుగా నిద్రమత్తు వదలని కంఠంతో.

''ఏమిటోయ్ ! మిట్టమధ్యాహ్నం మ ఒకటే నిద్ర తీస్తున్నావ్.'' తాపీగా పలకరింపుల దిగింది మనోరమ.

''ఏం నిద్రలే. పరీక్షల బోర్ వదిలిం కదా. ఇవాళ హాయిగా కంటినిండా ని పోదామన్నా నీలాంటి నక్షత్రకులు వుంటారు కొంపలంటుకుపోయినట్టు లేపడానికి.'' అం కోపంగా.

''బాగుందమ్మా ! పోనీ ఏదో శుభవార్త చెపుదాం కదా అని లేపితే ఏమిటో మరీ ఎగరటం. పోనీలే వెళ్ళి పడుకో ఓకే.''

నిద్రమత్తు దిగిపోయింది మంజులకి.

''మనూ ! ప్లీజ్ ! అంత కోపం ఆయిం ఎలాగోయ్. సారీవే. నీకు తెలుసుకదా. నేనా నిద్ర వీరభద్రాన్ని, ప్లీజ్ ఏమీ అనుకోకే. ఇంతకీ ఏమిటే ఆ శుభవార్త ?'' సాధ్యమయినంత మెత్తగా గొంతు మార్చుకుని అడిగింది.

''పోనీలెద్దూ, ఏదయితేనేం, నిద్ర పాడవ తోంది. వెళ్ళి పడుకో.''

''మనూ ! సారీవే. నిద్రమత్తులో ఏదో అంటే, మరీ అంత పట్టించుకుంటావేమిటి బంగారుతల్లివి కాని తొందరగా ఆ శుభవార్త ఏమిటో చెప్పవే'' బ్రతిమాలింది మంజుల.

''క్షమించేం పో ! రేపు మ్యూజిక్ ప్రోగ్రాం వుంది జనరల్ ఆడిటోరియంలో, వస్తావేమో అని.''

''ఛఛ ! ఇదా నీ శుభవార్త ! చాల్లే ఇక వుండు.'' అని తపీమని ఫోను పెట్టేయ

కళాప్రియ అకాడమి (నెల్లూరు) ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ప్రఖ్యాత వైణిక విద్వాంసులు శ్రీ చిట్టిబాబుగారిని శ్రీ దేవిరెడ్డి కోదండరామరెడ్డి సన్మానిస్తున్న దృశ్యం. ముఖ్య అతిథి పద్మభూషణ్ డాక్టరు శ్రీపాద పినాకపాణిగారినికూడా చిత్రంలో చూడవచ్చు.



# పద విన్యాసం

## విచ్చేన — అర్చన

చేరవలసిన ఎత్తుకు
చేరవలెననుకొన్నప్పుడు
నాస్తికుడు ఆశ్రయించేది—విచ్చేన !
ఆస్తికుడు ఆచరించేది—అర్చన !!

*

## రైలు — జైలు

పట్టాల పట్టు తప్పకుండా
పరుగెత్తినపుడు రైలు !
పట్టాల పట్టు తప్పించుకొని
పరుగెత్తితే దిక్కు జైలు !!

*

## బత్తె — గొత్తె

అస్తవ్యస్తానికి కారణాలు
ఆలోచించలేనపుడు
నీ మనసు ఒక బత్తె !
ఆలోచనా రహితంగా
వ్యక్తి ఆరాధనలో పడినపుడు
నిజంగా నీ వొక గొత్తె !!

*

## బడి — గుడి

మనిషి మనిషికీ ఎన్నో
మంచి మాటలు నేర్పేది బడి !
మనిషిని మాట్లాడనివ్వకుండా
నోరు నొక్కిపట్టేది గుడి !!

— పులికంటి కృష్ణారెడ్డి

బోయింది ఆమె తెచ్చిపెట్టుకున్న సహనం అంతా క్షణంలో ఎగిరిపోయింది

''ఆగాగు ఏమిటా విసురు ? పూర్తిగా వినకుండానే ? ఇందాక చెప్పిన నీ సారీలన్నీ అంత తొందరగా మరచిపోయేవన్నమాట.''

''ఇంతకీ శుభవార్త ఏమిటో చెప్పమరి '' అంది మళ్ళీ సహనాన్ని తెచ్చిపెట్టుకుంటూ, ఎంతకీ చెప్పనందుకు మనసులోనే తిట్టుకుంటూ

''నాకు తెలుసులే మనసులోనే తిట్టుకుంటూ వుంటావు సరేలే రెండు చెవులూ తెరుచుకుని విను రేపు రాధాకృష్ణ గానకచేరీ మొన్నటి ఫ్లడ్స్‌లో నష్టపోయినవారి గురించి యూత్ డెవలప్‌మెంట్ ఫామ్‌వాళ్ళు ఒక చారిటీ షో ఏర్పాటు చేసారు అందులో రాధాకృష్ణగారి గాన కచ్చేరీ అనే అంశం ఒక్కటే వుంది నీకేమైనా ఇంటరెస్టు వుందేమో అని'' అంది తాపీగా

తను సరిగ్గా విన్నదా అన్న సందేహంతో ''ఎవరి కచేరీ వుందీ'' అని అడిగింది మంజుల

''నువ్వు సరిగ్గానే విన్నావులే రాధాకృష్ణ గారిదే ''

''మనూ ! నిజమా ! మళ్ళీ వేళాకోళమా?'' సగం సంతోషం సగం సందేహం ఆమెలో పోటీ పడుతున్నాయి

''అయ్యో ఖర్మ ! నీచేత ఇన్ని చీవాట్లు తిని అబద్ధం చెప్పవలసిన అవసరం ఏముంది?''

''థాంక్యూ మనూ డియర్ ! ప్రోగ్రాం ఎన్ని గంటలకి ?''

''రేపు ఆరు గంటలకి వారంనించి ఎడ్వాన్స్ బుకింగ్ జరుగుతోందిట పరీక్షల హడావుడిలో

## వర్షించని మేఘం

మనకి తెలీలేదు మీ అన్నయ్యకి చెప్పు టిక్కెట్స్ గురించి ట్రై చెయ్యమని.''

నీరు కారిపోయింది మంజుల. ''అయ్యో టికట్స్ వున్నాయనుకున్నాను. పోనీలే ఆగు మా అన్నయ్యకి చెప్తాను '' అని గబగబా అతని గది లోకి పరిగెట్టింది. సంగతి విన్న రవీంద్ర బూటులేసు కట్టుకోవడం మానేసి తలెత్తి ఆశ్చర్యంగా చెల్లెలివైపు చూసాడు. ''మ్యూజిక్ అంటే ఇంత ఇంటరెస్ట్ ఎప్పటినించి'' అంటూ తమాషాగా కళ్ళెగరేశాడు అతనికి తెలుసు సంగీతానికి మంజులకి చుక్కెదురని.

ఉక్రోషం ముంచుకువచ్చింది మంజులకి అయినా తమాయించుకుంది. అవసరం తనది కదా మరి

''మనూ ఎలాగైనా చూడాలనుకుంటున్నాది.'' అంది అతని చూపులని తప్పించుకుందికి టేబుల్ పైన పుస్తకాలని తిరిగి సర్దుతూ

ఒక్క క్షణం చెల్లెలి మొహంలోకి చూసి ''అయితే నీకేం ఇంటరెస్ట్ లేదన్న మాట'' అన్నాడు తాపీగా టికెట్స్ లేకపోయినా ఫరవా లేదులే అన్న ధోరణి కనబరుస్తూ

''ఆహా అదికాదు — ఇద్దరం వెళ్దామని అనుకుంటున్నాం'' అంది మంజుల గాభరాగా, నిజంగానే అతను టికెట్స్ తేడేమో అనిపించి 'సరేలే ట్రై చేస్తాను' అని టెన్నిస్ రాకెట్ పూపుకుంటూ వెళ్ళిపోయేడు.

రాత్రి వుత్త చేతులతో తిరిగి వచ్చిన రవీంద్రని చూసి చెప్పలేని, నిరాశ ఆవహించింది మంజులను వెంటనే ఆ ఎంగిలి ఫోన్ చేసి మనోరమకి చెప్పింది

''ఏం చేస్తాం బాడ్ లక్, ఈ సారెప్పుడేనా చూద్దాంలే'' అంది మనోరమ

కాని మంజుల అంత తేలికగా తీసుకోలేక పోయింది ఆ రాత్రి ఆమెకి సరిగ్గా నిద్ర పట్ట లేదు కళ్ళముందు ఏవో దృశ్యాలు తిరగసాగాయి.

* * *

అరగంటై రేడియోపై తన చాతుర్య మంతా వినియోగిస్తున్న మంజుల విసిగిపోయింది కాని సిలోన్ తగల్లేదు. ఆమెకి బినాకా గీత్ మాలా అంటే చాలాఇష్టం అదేం ఖర్మో బుధ వారం వచ్చేసరికి సిలోన్ సరిగ్గా పలకదు. ఆమె విసుగ్గా ఇంకా గట్టిగా బరాబరామని తిప్ప సాగింది

ఇంతలో సడన్‌గా ఏదో స్టేషన్ తగిలింది. ఏదో కమ్మనిస్వరం ఆమెని ఆకట్టుకుంది ఆమె అలాగే ఆగి వినసాగింది సినిమాపాట కాదు అది. భావగీతంలా వుంది పాడుతున్న ఆ గొంతులో శ్రోతలని కట్టిపడేసే వేదన, ఆర్ద్రత గుండె లని తాకుతోంది ఆ గీతం తనకి తెలీకుండానే కళ్ళలో నీళ్ళుతిరిగేయి. అబ్బ ఏం కంఠం ఆ కంఠంలో ఎంత మధురిమ అనుకుంది మంజుల

సంగీతం అంటే అసలు పడదు ఆమెకి రేడియో సిలోన్, వివిధభారతిలో హిందీపాటలు తెలుగులో కూడా సినిమా పాటలు తప్ప ఇంకేమీ వినని ఆమెతనకి తెలీకుండానే ఆ రోజు ఆ కార్య క్రమం పూర్తిగా కొసదాకా చాలాశ్రద్ధగా వింది

ఇప్పుడు మీరు రాధాకృష్ణగారు పాడిన కొన్ని భావగీతాలు విన్నారు ఇందులో 'వర్షించని మేఘమునే నేను ఓ చెలీ' అన్న గీతం ఆయన స్వయంగా రచించినది రూపకల్పన కూడా ఆయన చేసినదే— అన్న ఎనౌన్సర్ మాటలు విని ఈ లోకంలోకివచ్చింది ''వర్షించని మేఘమునే'' అన్న ఆ పాట నిజంగా హైస్పీట్ భాషని మించి బాణి అంతకుమించి పాడిన గొంతులోని మార్దవం ఆ పాటకి ప్రాణం పోసాయి

''మళ్ళీ మీరు శ్రీ రాధాకృష్ణగారి కార్య క్రమం వచ్చేనెల తొమ్మిదవ తేదీన వినగలరు '' అన్న ఎనౌన్స్‌మెంట్ విని రేడియో కట్టేసింది అలా ఆమెకి అతని పాటలు వినటం, అతని ప్రోగ్రాంస్ గురించి ఎదురు చూడడం అలవా టయింది. అతనివి నెలకి కనీసం ఒకటి రెండు ప్రోగ్రామ్స్ వుండేవి అతని పాట వింటుంటే ఆమెకి పూల సౌరభంలో స్నానమాడుతున్నట్టు, విరి తేనెల మాధుర్యం చవిచూస్తున్నట్లు వుండేది

రాధాకృష్ణ పాటలో పాడే తీరులో ఏదో ఆకర్షణ వుంది. అతని స్వరంలో ఏదో అనిర్వచ నీయమైన మాధుర్యం, ఎలాంటి వాళ్ళనైనా కట్టి పడేసే లాలిత్యం వుంది ఏనాడూ రేడియోలో కార్యక్రమాలూ, ప్రత్యేకించి సంగీత కచేరీలూ విని ఎరుగని వారు కూడా ఒకసారి

అతని పాట వింటే మళ్ళీ మళ్ళీ వినాలని కోరిక పుట్టేటట్టు చేసే అయస్కాంతశక్తి అతనిగొంతులో వుందంటే అతిశయోక్తి కాదు మంజుల కూడా అందుకే ఆ గొంతులోని మాధుర్యానికి పులకించి ఆకర్షితురాలైపోయింది అందుకే ఆమె క్రమం తప్పకుండా అతని ప్రోగ్రామ్స్ తప్పకుండావినేది వినటమే కాదు అందులో తాదాత్మ్యం చెంది పోయేది

రాధాకృష్ణ! ఎంత అందమైన పేరు పేరుకుతగ్గ అందమైన, మధురమైన స్వరం మనిషికూడా తప్పకుండా అంత అందంగానే వుంటాడు అధరం మధురం అని కూనిరాగాలు తీస్తూంటే పగలబడినవ్వే రమేష్‌ని ఉక్రోషంగా చూసేది అతనికి తెలుసు. చెల్లెలికి సంగీత మంటే ఎంత ఇంటరెస్టో. అలాంటిది ఈమధ్య శ్రద్ధగా వినడమే కాకుండా కూనిరాగాలు కూడా తీస్తోందంటే ఆశ్చర్యంగా వుంది అతనికి.

మంజులకి రాధాకృష్ణ పాటంటే ప్రాణమని అతని కార్యక్రమాలు వచ్చినప్పుడు రేడియోకి అతుక్కుపోతుందని మనోరమకే కాకుండా స్నేహితులందరికీ తెలిసిపోయింది

''మంజూ! అతని కంఠమైతే బాగుంది కాని మనిషి లావుగా అందవికారంగా వుంటాడేమోనే సాధారణంగా ఆర్టిస్టులు వాళ్ళ ఆర్టుకి విపరీతంగా వుంటారు'' అని ఆట పట్టించే మనోరమతో —

''అతనెలా వుంటే నాకేం అతని పాట బాగుంటుంది కాబట్టి వేలాది శ్రోతలలో నేనూ ఒకర్తిని'' అని దబాయిస్తుంది కాని అలాంటి రూపం కళ్ళ ముందు ప్రత్యక్ష మయేసరికి హడలి పోతుంది. అలా కాకూడదు అని ఏ మూలో బలమైన కోరిక. అతనిని ఎలాగైన చూడాలన్న కోరిక అలా అలా మహావృక్షంలా పెరిగిపోసాగింది కాని ఎలా? రెండు మూడుసార్లు ఏవో సందర్భాలలో అతని ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయబడ్డా ముందునించి తెలీకో మరే ఇతర కారణాల వలనో వెళ్ళడానికి వీలుపడలేదు.

ఈసారి కూడా ఆ అవకాశం చెయ్యి జారి పోయిందనుకోగానే ఆమెకి తెలీకుండానే ఆమె కనులు సజలమయేయి అలాగే ఆలోచనలలో పడి ఆమె ఎప్పటికో నిద్రలోకి జారుకుంది

ఉదయం లేచిన దగ్గరనించి ఆమెకి మన స్సంతా చికాకుగా వుండి ఏ పనిమీదా మనసు నిలవలేదు తల్లి కేకలు వెయ్యగా వెయ్యగా స్నానం చేసి భోజనం చేసింది మళ్ళీ తన గదిలోకి పోయి మంచంమీద పడిన కూతురిని చూసి ఆవిడ ''ఏమిటే ఇవాళ అలా వున్నావు ఒంట్లో బాగులేదా?'' అని నుదుటిమీద చెయ్యి వేసి చూసి ''జ్వరం లేదే'' అన్నారు

''ఏం లేదమ్మా! కాస్త తలనొప్పిగా వుంది కాస్త పడుకుంటాను'' అంది ఇంకా తల్లి ఏం ప్రశ్నలు వేస్తుందో అని నిద్ర వస్తున్న దానిలా కళ్ళు మూసుకుని మరేం మాట్లాడకుండా ఆవిడ వెళ్ళిపోయింది కాసేపు అలా దొరలి మళ్ళీ లేచి ఏదో పుస్తకం పట్టుకుని పడుకుంది పుస్తకం చేతిలోవున్నా మనసు మాత్రం ఎక్కడో వుంది రవీంద్ర రేడియో వేసినట్టున్నాడు తెలుగు పాటలు వస్తున్నాయి అప్పుడే రెండున్నర దాటిందన్న మాట. ప్స్ అనుకుంది పుస్తకం గుండెలమీద పెట్టుకుని కళ్ళు మూసుకుని పడుకుంది అలాగే పావుగంట అయేసరికి రవీంద్ర పిలుపు వినిపించింది. ఆమెకి లేవాలని లేదు అలాగే పడుకుంది — కాని ఈసారి పిలుపు ఇంకా గట్టిగా వినిపించడంతో లేచి బయటకి వచ్చింది మెట్ల మీద నించుని ''ఏమిటి?'' అంది ''నీకు ఫోను మనోరమ పిలుస్తోంది''

''దానికి పనీపాటు లేదు ''అని విసుక్కుంది అన్నగారిని ఏమీ అనలేక

ఫోను పట్టుకుంటే కాళ్ళు పీక్కుపోయినా, భోజనం సగంలో ఆపి వచ్చినా, చదువుకుంటూ లేచి వచ్చినా అలా ఫోనుకే అంటుకుపోయే చెల్లెనా అన్నట్టు విచిత్రంగా చూసేడు రవీంద్ర.

''హలో!''

''హలో! మంజూ గుడ్ న్యూస్ నేను అడక్కపోయినా నాకు చాకోబార్ అయిస్క్రీం ఇప్పిస్తావని తెలుసు టికట్లు దొరికేయి రెడీ అవు''

''మనూ! రియల్లీ!'' ఆమె గొంతులో ఆశ్చర్యం, ఆనందం పోటీ పడుతున్నాయి చిరాకెటు ఎగిరిపోయిందో! ''ఆఁ ఆఁ జాగ్రత్త అక్కడ కుర్చీమీద కూర్చో'' అన్న మనోరమ మాటలకి కోపం తెచ్చుకోక ''చాల్లే హాస్యం తొందరగా రెడీ అవు'' అంది

''మైగాడ్ అప్పుడే రెడీ అవాలా టైమ్-ఎంతైందనుకుంటున్నావు? మూడుంపావు అయినా నేనెందుకు రెడీ అవడం నువ్వు ఇప్పుడే మొదలెడుతావు కాబోలు మేకప్పు వెళ్ళు కాని ఆ వేళకి తెమిలిపో నేను అయిదున్నరకి మీ ఇంటిదగ్గర వుంటాను''


''సరే! ఇంతకీ ఎలా దొరికేయి టికట్లు?''

''మన శ్యామల లేదూ! దానిది మ్యూజిక్ కాలేజీ వాళ్ళకి ఫ్రీ పాసు ఇచ్చేరు ఒకదానిమీద ఇద్దరు వెళ్ళొచ్చుట కాని తీరా అది వెళ్దామనుకునేసరికి ఇవాళ అనుకోకుండా దానికి పెళ్ళి చూపులకి ఎవరో వస్తున్నారు ఎవరికేనా కావలిస్తే ఇచ్చెయ్యమని వాళ్ళ తమ్ముడిచేత పంపించింది''

''మనం అదృష్టవంతులమే మనూ! అనుకోకుండా టికెట్స్ దొరికేయి'' ఆమె సంతోషంతో పొంగిపోతోంది అక్కడే వున్న రవీంద్ర వారి సంభాషణ కొంత విని మిగిలినది వూహిస్తూ వుండడంవలన ''టికట్లు దొరికినట్టున్నాయి'' అన్నాడు అతను మామూలుగానే అన్నా మంజుల ఎందుకో తత్తరపడింది మామూలుగానే వుండడానికి ప్రయత్నిస్తూ ''ఆఁ దొరికేయి శ్యామల పంపించిందిట'' అంది

మంజులకి తన గదిలోకి వెళ్ళేక ఏం చెయ్యాలో తోచలేదు అయిదు నిముషాలు అలా



కూర్చుంది తరవాత లేచి బీరువా దగ్గరకి నడిచింది సాయంత్రం ఏ చీర కట్టుకోవాలి అనుకుంటూ తనకున్న చీరెలన్నీ తీసి చూడసాగింది ఆమెకి ఆ క్షణంలో తను ఏ చీర కట్టుకున్నా ఒకటేనని అంతమంది జనంలో ఎవరో తెలీని తనను అతను చూడడని గుర్తు రాలేదు

ఎంత నసుగుతూ తయారైనా చాలా తొందరగానే తయారైపోయింది మధ్యాహ్నం దాకా మన్ను తిన్న పాములా పడివున్న కూతురు సడన్‌గా లేచి బొంగరంలా తిరుగుతూ హుషారుగా తయారైపోతూ వుంటే పార్వతమ్మ గారు ఆశ్చర్యంగా చూసేరు ఏమిటో ఈ కాలం పిల్లలు? ఏ క్షణం ఎలా వుంటారో చెప్పలేముకదా అనుకున్నారు

అయిదున్నర అవుతూ వుండగానే మనోరమ వచ్చినా ఎంతో ఆలస్యంగా వచ్చినట్టనిపించింది మంజులకి అయినా ఏమీ అనలేదు ఏమైనా అంటే మనోరమ తనని బ్రతకనివ్వదని

వాళ్ళు అక్కడికి చేరేసరికి హాలంతా జనంతో నిండిపోయి వుంది మ్యూజిక్ కాలేజీ వాళ్ళకి సాధారణంగా కాస్త ముందురే సీట్స్ ఇస్తారు అందువలన వీళ్ళకి పెద్ద ఇబ్బంది అవలేదు. నాటకాలు డాన్సులు లాంటి వాటికి తప్ప ఇలాంటి ప్రోగ్రావ్స్‌కి ఎక్కువ జనం రారనుకునే మంజుల ఆ జనం చూసి ఆశ్చర్యపోయింది మనోరమ పక్కనే తెలిసినమ్మాయి వుంటే ఏదో మాట్లాడు తోంది ఇంతలో ''ఇక్కడికి ఎంతో ఉత్సాహంతో విచ్చేసిన ప్రేక్షకులకి మా నమస్కారములు. మీరు కొన్నిక్షణాలుఓపికపడితే మాకార్యక్రమంప్రారంభం చేయబోతున్నాము మీరంతా నిశ్శబ్దంగా వుండి తుది వరకు మా ప్రోగ్రాం విని ఆనందించి మమ్మల్ని కూడా ఆనందపరచవలసిందిగా కోరుతున్నాం'' అన్న అనౌన్స్‌మెంట్ వినిపించింది మంజుల సర్దుకుని కూర్చుంది ఆమె దృష్టి స్టేజిపైనే వుంది. నిజంగా రెండు క్షణాల్లోనే తెర లేచింది స్టేజిపైన మధ్యగా ఒక యువకుడు కూర్చుని వున్నాడు తెల్లని పైజామా లాల్చీలలో వున్న అతను స్ఫురద్రూపీ అందమైన వాడూ అని చూడగానే చెప్పొచ్చు అతను కళ్ళకి రంగు కళ్ళద్దాలు ధరించేడు వొత్తైన నొక్కుల జుత్తు ఆ కూర్చోవడంలో కూడా ఒక ఠీవీ. తను వూహించిన దాని కంటే బాగున్నాడు అనుకుంటూ మనోరమ వైపు చూసింది మంజుల. ఆ చూపులో కించిత్ గర్వం చూసావా ఇప్పుడే మంటావు అన్న సవాల్ వుంది

''కంగ్రాచ్యులేషన్స్ మంజూ! నిజంగానే హీరోలా వున్నాడు మీ రాధాకృష్ణ'' అంది ఆమె చెయ్యి పట్టుకుని వూపేస్తూ మెల్లగా గుసగుసలాడుతూ మనోరమ

కార్యదర్శి మైకు దగ్గరకు వచ్చి పరిచయ వాక్యాలు పలికేడు ''ఇంతకుముందు చాలాసార్లు

# వర్షించని మేఘం

మీరంతా శ్రీ రాధాకృష్ణగారి స్వరమాధుర్యాన్ని ఆస్వాదించే వున్నారు. ఆయన గురించి ఏం చెప్పినా సూర్యునికి దివిటీ చూపించడం లాటి ప్రయత్నమే. ఇంత చిన్న వయసులో ఆయన గడించుకున్న పేరు ప్రఖ్యాతులు ముదావహం ఇక నేను ఎక్కువసేపు విసిగించటం భావ్యంకాదు మనమంతా గాన మాధుర్యంలో ఓలలాడుదాం'' అని అతను స్టేజి దిగిపోయేడు. రాధాకృష్ణకి పూలమాల వేసేరు అతను కూర్చుని సభకు నమస్కారం చేసి ''మీ అందరి ఆదరాభిమానాలే నన్ను ఇక్కడిదాకా తీసుకుని వచ్చేయి ఏ కళాకారుడైనా ముందుకి రావడానికి అతనికి అతని అభిమానుల ప్రోత్సాహం అండదండలులభించాలి. అసలు అతను ఒక గమ్యం చేరుకోవడానికి అవే కారణం అవి లేనినాడు ఏ కళాకారుడూ ఏమీ చెయ్యలేడు నన్ను ఇంతగా అభిమానించి ప్రోత్సహిస్తున్న మీ అందరికీ నా కృతజ్ఞతాభివందనలు'' అని వినయంగా నమస్కరించి గొంతు సవరించుకుని ఆలాపన మొదలుపెట్టేడు ప్రథమంగా గణపతి స్తుతి చేసి తరువాత కొన్ని కీర్తనలు అష్టపదులు పాడేడు ఆఖరున భావగీతాలు తను పాడదల్చుకున్నాననీ, మరికొన్ని ప్రేక్షకులు కోరినవీ పాడేడు అన్నీ ఒకదానిని మించి ఒకటి వున్నాయి ఏది గొప్పో చెప్పలేనంత గొప్పగా పాడేడు తమని తాము మరచిపోయి విన్నారు ప్రేక్షకులు ''ఆఖరున నేను మరొక పాట పాడి ఈనాటికి శలవు తీసుకుంటాను. ఇది నాకు చాలా ఇష్టమైన పాట మీకు కూడా నచ్చుతుందనే ఆశిస్తున్నాను'' అని ఒక క్షణం ఆగేడు

ఏం పాడతాడా అని ప్రేక్షకులతో పాటు మంజుల కూడా ఎదురు చూడసాగింది.

అతను ''వర్షించని మేఘమునే నేను ఓ చెలీ'' అని ఎత్తుకోగానే కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి ''అబ్బ ఈ పాటని ఇష్టపడేవారు ఇంత మంది వున్నారన్నమాట,'' అనుకుంది మంజుల కుర్చీలో కాస్త ముందుకి వంగి శ్రద్ధగా వినసాగింది పాట ముగిసేసరికి ఎందుకో ఆమె కళ్ళనిండా నీరు ఆ గీతంలో ఏదో తపన, ఆవేదన వున్నాయి భావంలో ఆర్ద్రత గుండెల్ని తాకుతుంది అది అతని గుండెలోంచి వచ్చిందా అన్నంత సహజంగా వుంది ఇంచుమించు అక్కడవున్న వారంతా అదే పరిస్థితిలోవున్నారు

మనం వెళ్ళి అతన్ని అభినందించి వద్దామా అన్న మనోరమ మాటలకు మవునంగానే తలూపింది ఇంతలో స్టేజిమీదికి అధ్యక్షులు వచ్చేరు. ఆయన రాధాకృష్ణని కాసేపు పొగిడేరు ఆ తరువాత మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపాల్‌గారు స్టేజిపైకి వచ్చేరు అసలు ఈ ప్రోగ్రాం అరేంజ్ చేసింది మ్యూజిక్ కాలేజీవారే ఆయన మైక్ దగ్గరకి వచ్చి గొంతు సవరించుకున్నారు

''నేడు శ్రీ రాధాకృష్ణగారు ఇక్కడికి విచ్చేసి తన అపురూపమైన స్వరలహరిలో మనని ఓలలాడించి మనని ఆనందపుటంచులని తాకేట్టు చేయడం మన అదృష్టం ఆయన ఇంతకు ముందు చాలా ప్రోగ్రావ్స్ ఇచ్చి అఖండమైన పేరు ప్రఖ్యాతులు గడించేరు మన మ్యూజిక్ కాలేజీ వారిని సత్కరించాలని నిశ్చయించుకుని వారిని ఇక్కడికి ఆహ్వానించడం జరిగింది వారు మా అభ్యర్థనని త్రోసి పుచ్చకుండా వచ్చినందుకు మా కృతజ్ఞతలు చంద్రునికో నూలుపోగు అన్నట్టు మా చిన్న కానుకని వారు స్వీకరిస్తారని ఆశిస్తాను'' ఆయన ఏదో పాకెట్ కరతాళ ధ్వనుల సందట్లో అతని దగ్గరికి వెళ్ళి అందించేరు

అతను అది అందుకుని,ఆయనకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపి ప్రేక్షకులకికూడా నమస్కరించి తన చేతిలో పాకెట్‌ను తన ప్రక్కనే కూర్చున్నతని చేతిలోపెట్టేడు ప్రక్కనతను లేచి చేయి అందించగా తనుకూడా లేచి అతన్ని అనుసరించేడు మంజులకి మనోరమకి అంతా అయోమయంగా వుంది ఒకరి సహాయంతో నడవడం, నడకలో తడబాటు ఇవన్నీ ఏదో అపశ్రుతిని సూచిస్తున్నాయి. ఇంతలో ఎవరో వెనక మెల్లగా అనుకుంటున్న మాటలు చెవిన పడ్డాయి

''భగవంతుడు ఎంత నిర్దయుడో చూడండి ఇంత అందమైన రూపం, ఇంత విద్య, కళా పిపాస అన్నీ ఇచ్చి బదులుగా ఆ దృష్టి లాగేసుకోవాలా? పాపం మొదటినించి గ్రుడ్డివాడు కాదట''

ఆ పై మాటలు ఇక మంజులకి వినిపించలేదు కళ్ళముందు ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్టనిపించింది ఆమె మనోరమ చేతిని గట్టిగా పట్టుకుంది ★

## పిలుపు

ఇంధనం బండికి
సమకూర్చలేని వాడికి
ఎందుకు బండి?

పట్టెడన్నం ఆకలికి
సంపాదించలేని వాడికి
ఎందుకీ శరీరం?

శ్రమజలాల నోడ్చి
క్షేత్రాన్ని పండించమని
రక్తాన్ని చిందించియైనా
వ్యక్తిగా నిలువమని
పంచభూతాలు మనిషికి
పిలుపు నిస్తున్నాయి

— కాణిపాకం లింగన్న